సాక్షి
ఖమ్మం
శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



భూమి పోయినా దక్కని ఫలితం

సీతారామ లింక్ కెనాల్‌లో భాగంగా భూములు కోల్పోయిన 200మందికి పైగా రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. 8లో



కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా

మిరప తోటలో పని కోసం కూలీలు వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 17°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం మంచు ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ పెరిగినా రాత్రికల్లా మళ్లీ సాధారణ స్థితికి చేరుతుంది.

పాలేరులోకి మున్నీరు

పాలేరు రిజర్వాయర్ బహుళ ప్రయోజనకారిగా మారనుంది. సాగు, తాగునీటితో పాటు రిజర్వాయర్ పరిధిలో విద్యుదుత్పత్తి కేంద్రానికి సైతం నీటికి ఢోకా లేకుండా మున్నేటి నీటిని సీతారామ ప్రాజెక్టు పరిధి పాలేరు లింక్ కెనాల్‌లో కలిపి.. అక్కడి నుంచి రిజర్వాయర్‌లోకి చేర్చేలా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో సిద్ధమైన ఈ ప్రతిపాదనలు అమల్లోకి వస్తే నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత లేకున్నా పాలేరు రిజర్వాయర్‌లో రెండు సీజన్లలోనూ జలకళ ఉట్టిపడుతుందని చెబుతున్నారు. అలాగే, ఖమ్మంతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు సాగు, తాగునీరు కొరత తీరనుంది.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం



మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో మున్నేటిపై దుబ్బతండా వద్ద చెక్‌డ్యామ్





పాలేరు రిజర్వాయర్ (ఫైల్)

▶▶ వృథా నీటిని ఒడిసిపట్టేలా

వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు అలుగు నీటితో మున్నేరు జీవం పోసుకుంది. అక్కడి నుంచి మహబూబాబాద్ జిల్లా మీదుగా ప్రవహిస్తూ అలిగేరు, ఆకేరు నీటిని కలుపుకుని ఖమ్మం జిల్లా మీదుగా వెళ్లి కృష్ణానదిపై నిర్మించిన పులిచింతల ప్రాజెక్టులో కలుస్తుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాదుల ప్రాజెక్టు మూడో దశతో పాకాల సరస్సుకు నీటి లభ్యత పెరగగా, బయ్యారం వాగుతో వచ్చే అలిగేరు నీరు కూడా కలిసి ఏటా వానాకాలంలో మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏటా 30 టీఎంసీల మున్నేటి జలాలు కృష్ణా నదిలో కలుస్తుండగా, ఇందులో కొంతవరకైనా వాడుకునేలా పాలేరు రిజర్వాయర్‌కు తరలించాలని నిర్ణయించారు.

▶▶ దుబ్బతండా చెక్‌డ్యామ్ నుంచి..

మహబూబాబాద్ జిల్లాలో అలిగేరు – పాకాల వాగులు కలిసే ప్రాంతానికి 3 కి.మీ. దిగువన గార్ల మండలం దుబ్బతండా వద్ద చెక్‌డ్యామ్ నుంచి మున్నేరు నీరు దిగువకు వెళ్తోంది. ఇక సీతారామ ప్రాజెక్టులో భాగంగా ఏన్కూరు నుంచి పాలేరు రిజర్వాయర్ వరకు 75 కి.మీ. మేర లింక్ కెనాల్ పనులు కొనసాగుతున్నాయి. ఈమేరకు దుబ్బతండా నుంచి మున్నేటి జలాలను గార్ల మండలం బుద్దారం సమీపాన పాలేరు లింక్ కెనాల్‌లోకి 37.5 కి.మీ. వద్ద చేర్చేలా 9.650 పొడవుతో కాల్వ తవ్వాల్సి ఉంటుంది. ఆపై నీరు మరో 37.5 కి.మీ. ప్రవహించి పాలేరు రిజర్వాయర్‌లో కలుస్తుంది. దుబ్బతండా వద్ద మున్నేటి బెడ్‌లెవల్ 145.7 మీ. కాగా.. బుద్దారం వద్ద పాలేరు లింక్ కెనాల్ బెడ్ లెవల్ 142 మీ. కావడంతో గ్రావిటీ ద్వారా నీటి మళ్లింపు సులువు కానుంది.

▶▶ అంచనా వ్యయం రూ.145 కోట్లు..

ఈ అంశంపై ఇటీవల నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లో సమీక్షించారు. మంత్రుల సూచనలతో జలవనరుల శాఖ అధికారులు రూ.145 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మున్నేటి నుంచి 10 నుంచి 12 టీఎంసీల మేర నీటి తరలించేందుకు కాల్వ తవ్వకానికి 200 ఎకరాల భూసేకరణ అవసరమని భావిస్తున్నారు. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే పనులకు త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శంకుస్థాపన చేయించాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం.

బహుళ ప్రయోజనకారిగా మారనున్న రిజర్వాయర్

- దుబ్బతండా చెక్‌డ్యామ్ నుంచి లింక్ కెనాల్‌కు జలాల తరలింపు
- 9.650 కి.మీ. కాల్వ తవ్వకానికి రూ.145 కోట్లతో ప్రతిపాదనలు
- సాగు, తాగునీటితో పాటు విద్యుదుత్పత్తికి తీరనున్న ఇక్కట్లు
- త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పనులకు శంకుస్థాపన?

▶▶ ఒక్క రిజర్వాయర్‌తో..

పాలేరు రిజర్వాయర్ నీటి సామర్థ్యం 2.5 టీఎంసీలు(23 అడుగులు) కాగా సాగర్ రెండో జోన్‌లో ఉంది. ఇక్కడి నుంచే జిల్లాలోని 2.54 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతోంది. అలాగే, నేలకొండపల్లి, రఘునాథపాలెం, ఖమ్మంరూరల్, ముదిగొండ, తిరుమలాయపాలెం, ఖమ్మం కార్పొరేషన్, వైరా రిజర్వాయర్ పరిధిలో మిగతా మండలాలు, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 16 మండలాలు, సూర్యాపేట జిల్లాలోని మోతె, జాజిరెడ్డిగూడెం, నాగారం, మద్దిరాల, నూతనకల్, తుంగతుర్తి, చివ్వెంల, ఆత్మకూర్(ఎస్) మండలాలకు తాగునీరు సరఫరా అవుతోంది. అంతేకాక పాలేరు రిజర్వాయర్ నీటి ఆధారంగా 2మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్రాజెక్టు కూడా ఉంది.

▶▶ బహుళ ప్రయోజనకారిగా..

కృష్ణా నది ఎగువన వర్షాభావ పరిస్థితులు తలెత్తితే పాలేరు ఒట్టికుండలా మారుతోంది. దీన్ని అధిగమించేలా మున్నేటి నీటిని పాలేరులోకి మళ్లించే ప్రతిపాదనలు రూపొందించారు. దుబ్బతండా చెక్ డ్యామ్ నుంచి మున్నేరు నీటిని పాలేరు లింక్ కెనాల్ ద్వారా రిజర్వాయర్‌లోకి చేరిస్తే డోర్నకల్ ప్రాంతంలోని పది చెరువులను నింపడం సాధ్యమవుతుంది. అంతేకాక సూర్యాపేట జిల్లాలోని మునగాల, నడిగూడెం మండలాల పరిధిలో 45 వేల ఎకరాలు, పాలేరు రిజర్వాయర్ పరిధిలోని ఎన్నెస్పీ ఆయకట్టు మొత్తం స్థిరీకరణ జరుగుతుంది. అలాగే, భక్తరామదాసు ప్రాజెక్టు, ఎస్సారెస్పీ రెండో దశ ఆయకట్టుకు కూడా నీటి ఇబ్బందులు తప్పనున్నాయి.

న్యూస్‌రీల్

ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ



బియ్యాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ నాగేశ్వరరావు

వైరా: వచ్చే ఉగాది నుంచి రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. ఈనేపథ్యాన వైరాలోని గిడ్డంగుల సంస్థ గోదాంలను శుక్రవారం పరిశీలించిన ఆయన బియ్యం నిల్వలపై ఆరా తీశారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయనున్న నేపథ్యాన సీఎంఆర్‌గా మిల్లర్లు అప్పగిస్తున్న బియ్యం నిల్వల్లో జాగ్రత్తలు పాటించాలని ఉద్యోగులకు సూచించారు.

పట్టువస్త్రాలు సమర్పించిన రామదాసు వారసులు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న శ్రీనివాసరావు

నేలకొండపల్లి: భక్తాగ్రేసరుడైన భక్త రామదాసు జయంతి ఉత్సవాలు ఆయన స్వస్థలమైన నేలకొండపల్లిలో శనివారం మొదలుకానున్నాయి. ఈసందర్భంగా ఆయన పదో తరం వారసులు కంచర్ల శ్రీనివాసరావు శుక్రవారం స్థానిక ధ్యాన మందిరంలో పట్టు వస్త్రాలను సమర్పించారు. మందిర అర్చకుడు సౌమిత్రి రమేష్, భక్తరామదాసు విద్వత్ కళాపీఠం ప్రతినిధులు సాధు రాధాకృష్ణమూర్తి, పెండ్యాల గోపాలకృష్ణమూర్తితో పాటు వంగవీటి నాగేశ్వరరావు, పసుమర్తి శ్రీనివాస్, గండికొట వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ తనిఖీ



చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

వైరా: వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలో చేపట్టిన కుష్ఠు బాధితుల గుర్తింపు సర్వేపై ఆరా తీశారు. ఈనెల 13వరకు కొనసాగే సర్వేలో భాగంగా ప్రతీ ఇంటికి వెళ్లి పరీక్షించాలని సూచించారు. అలాగే, మలేరియా, డెంగీ కేసుల నమోదు, చికిత్స వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడిన డీఎంహెచ్‌ఓ ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. జిల్లా మలేరియా అధికారి వెంకటరమణ, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రామ్ ఆఫీసర్ దుర్గ, పీహెచ్‌సీ వైద్యాధికారి టి.ఉదయలక్ష్మి, ఉద్యోగులు పాల్గొన్నారు.

వరిని ఆశిస్తున్న ఆకు ముడత తెగులు



రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

కొణిజర్ల: కొణిజర్లలో పలువురు రైతులు సాగు చేసిన వరి పంటను శుక్రవారం వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈసందర్భంగా వైరా కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ మాట్లాడుతూ వరి పిలక వేసే దశలో ఆకు ముడత తెగులు ఆశిస్తోందని తెలిపారు. ఈ పురుగు ఆశించినప్పుడు పత్రహరితాన్ని తినేస్తుండడంతో ఆకు నిలువునా ముడుచుకుంటుందన్నారు. అలాగే, పొలంలో గుంపులుగా ఎగిరే రెక్కల పురుగులు కనిపిస్తున్నాయని, వీటి గుర్తింపునకు దుబ్బు నుంచి పిలకలు తీసి చూస్తే పసుపు రంగులో లార్వాను గమనించొచ్చని చెప్పారు. దీని నివారణకు ఎసిఫేట్ 75 ఎస్‌పీ 1.5 గ్రాములు లేదా కార్టాప్ లేదా క్లోరాంట్రోనిలిప్రోల్ లేదా ఫ్లూబెండమైడ్ మార్చి మార్చి నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.చైతన్య, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ పీఎస్‌ఎం.ఫణిశ్రీ, ఏఈఓ డి.బాలాజీ పాల్గొన్నారు.

ఆకలితో చదవకుండా..



ఖమ్మం శాంతినగర్ హైస్కూల్‌లో ఎస్సెస్సీ విద్యార్థులు

- ఎస్సెస్సీ విద్యార్థులకు నేటి నుంచి అల్పాహారం
- 38రోజుల పాటు అందించేందుకు నిధులు

ఖమ్మంసహకారనగర్: పదో తరగతి ఫలితాల పెంపుపై దృష్టి సారించిన రాష్ట్రప్రభుత్వం సూచనలతో రెండు నెలలుగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అత్యధికంగా పేదలే కావడంతో ఉదయం నేరుగా పాఠశాలకు వచ్చి మధ్యాహ్న భోజనం చేస్తున్నా సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరై ఇంటికి వెళ్లే సరికి ఆలస్యమవుతోంది. ఈక్రమాన ఆకలితో బాధపడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం సాయంత్రం అల్పాహారం అందించాలని నిర్ణయించింది. వార్షిక పరీక్షలు మొదలయ్యే వరకు 38రోజుల పాటు అల్పాహారం సమకూర్చేందుకు నిధులు సైతం విడుదల చేసింది.

గత ఏడాది 92 శాతం

పదో తరగతి ఉత్తీర్ణత జిల్లాలో గత ఏడాది 92శాతంగా నమోదైంది. ఈసారి మరింత పెంచాలనే పట్టుదలతో ప్రభుత్వ సూచనలతో అధికారులు, ఉపాధ్యాయులు రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ, అనుబంధ యాజమాన్యాల పాఠశాలలు 283 ఉండగా, వీటిలో ఎస్సెస్సీ విద్యార్థులు 9,545 మంది చదువుతున్నారు. వీరికి ప్రతిరోజు ఉదయం 8నుంచి 9గంటల వరకు, సాయంత్రం 4–15నుంచి 5–15గంటల వరకు ఈ తరగతులు కొనసాగుతున్నాయి. ఈనేపథ్యాన సాయంత్రం తరగతులు ముగిసి ఇంటికి వెళ్లేలోగా విద్యార్థులు నీరసంతో చదువుపై దృష్టి సారించలేక పోతున్నారని గుర్తించారు. కొన్నిచోట్ల దాతల చేయూతతో, ఇంకొన్నిచోట్ల ఉపాధ్యాయులు బిస్కెట్లు వంటివి సమకూరుస్తున్నా మెజార్టీ పాఠశాలల విద్యార్థులు ఆకలితోనే తరగతులకు హాజరవుతున్నారు. దీంతో ప్రభుత్వమే సాయంత్రం వేళ అల్పాహారం అందించేందుకు నిర్ణయించింది.

38రోజులకు ప్రణాళిక...

ఈనెల 1వ తేదీ(శనివారం) నుంచి మార్చి 20వ తేదీ వరకు 38రోజుల పాటు పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15చొప్పున 9,545మందికి గాను రూ.54,40,650ను జిల్లాకు విడుదల చేశారు. దీంతో ఉడికించిన బొబ్బర్లు, పెసలు, పల్లీబెల్లం, శనగలు, మిల్లెట్ బిస్కెట్లు, ఉల్లి పకోడీ వంటి రోజుకొకటి సమకూర్చేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేటి నుంచి అమలుచేస్తాం..



పదో తరగతి విద్యార్థులకు నేటి నుంచి అల్పాహారం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయమై ఇప్పటికే ఎంఈఓలు, హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థులకు అల్పాహారం సమకూర్చనున్నందున శ్రద్ధగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలి.

– సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

రోడ్డుప్రమాదాల నివారణ అందరి బాధ్యత

- అదనపు కలెక్టర్ శ్రీజ
- రవాణా శాఖ ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ, పక్కన అధికారులు

ఖమ్మంక్రైం: రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయనే విషయాన్ని అందరూ గుర్తించి ప్రమాదాల నివారణను బాధ్యతగా భావించాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. వాహనంతో రోడ్డుపైకి వస్తున్నామంటే రహదారి భద్రతా నియమాలు తెలిసి ఉండాలని చెప్పారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా రవాణా శాఖ ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. అలాగే, హెల్మెట్, సీట్ బెల్ట్ ఆవశ్యకత, పిల్లలు వాహనాలు నడిపితే జరిగే ప్రమాదాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ వెంకటరమణ మాట్లాడుతూ వాహనదారులు అన్ని పత్రాలు వెంట ఉంచుకోవడంతో పాటు నిబంధనలు పాటించాలని తెలిపారు. కాగా, వాహనదారులు వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్లు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయవద్దని తెలిపారు. కాగా, ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆర్టీవో కార్యాలయం వరకు కొనసాగగా రోడ్డు భద్రత నియమాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో వైరా, సత్తుపల్లి ఎంవీఐలు వరప్రసాద్, శ్రీనివాస్, ఏఎంవీఐలు స్వర్ణలత, సుమలత, వంశీ, ఏఓ జహీద్‌అలీతో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులు, డ్రైవర్లు పాల్గొన్నారు



బైనాక్యులర్ ద్వారా పాలేరు రిజర్వాయర్‌ను వీక్షిస్తున్న శ్రీజ, పక్కన డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ తదితరులు

పాలేరు పార్కుల పరిశీలన

కూసుమంచి: మండలంలోని పాలేరులో రిజర్వాయర్ సమీపాన పార్కులను శుక్రవారం అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. పాలేరును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఇటీవల రూ.5కోట్లు మంజూరు కాగా, చేయాల్సిన పనులపై డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, జిల్లా పర్యాటక అధికారి సుమన్‌చక్రవర్తితో కలిసి పరిశీలించిన ఆమె వివరాలు తెలుసుకున్నారు. పార్కులను అభివృద్ధి చేస్తే వచ్చే పర్యాటకులు ఆటవిడుపుగా గడిపే అవకాశముంటుందని, అంతేకాక బోటింగ్ కూడా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో నిధులకు ప్రతిపాదనలు : ఎంపీ

ఖమ్మంవన్‌టౌన్: పార్లమెంట్‌లో శనివారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి పెండింగ్ అంశాలకు నిధులు కేటాయించాలని ప్రతిపాదించినట్లు ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. కొత్తగూడెంలో విమానాశ్రయం, భద్రాచలం–కొవ్వూరు రైల్వేలైన్, ఎంఎస్‌ఎంఈ ద్వారా చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపన, ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే, కోదాడ – ఖమ్మం, ఖమ్మం – విజయవాడ హైవేలకు నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు సమర్పించినట్లు వెల్లడించారు. అలాగే, కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, పినపాక వద్ద కిన్నెరసానిపై రెండో వంతెన నిర్మాణానికి సైతం నిధులు కేటాయించాలని కోరినట్లు ఎంపీ తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై కొరడా

- చర్యలకు ఉపక్రమించిన కేఎంసీ కమిషనర్ అభిషేక్
- నిబంధనలు పాటించని కాంట్రాక్టర్ టెండర్లు రద్దు

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై కమిషనర్ అభిషేక్ అగస్త్య చర్యలకు ఉపక్రమించారు. కమిషనర్ శుక్రవారం 4వ డివిజన్‌లో తనిఖీలకు వెళ్లిన సమయాన జవాన్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. జవాన్ నాగుబాయిని విధుల నుంచి తొలగించాలని, ఆ డివిజన్ ఇన్‌చార్జ్ బాధ్యతలను 4వ డివిజన్ జవాన్‌కు అప్పగించాలని అధికారులకు సూచించారు. అలాగే, ఇంజనీరింగ్ సెక్షన్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పవన్, శ్రీనివాస్, శ్రీకాంత్‌ను రెవెన్యూ విభాగానికి అటాచ్ చేయాలని ఆదేశించారు. వీధి దీపాలు మార్చడంలో నిర్లక్ష్యం వహించిన ఎలక్ట్రికల్ విభాగం ఉద్యోగి కరుణాకర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అంతేకాక నిబంధనలను పాటించని కాంట్రాక్టర్‌కు సంబంధించి రెండు టెండర్లను రద్దు చేయాలని సూచించారు. అలాగే, రికార్డుల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో వాహనాల కాంట్రాక్ట్, కార్యాలయ నిర్వహణ, ఈపీఎఫ్ నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించకపోవడంతో సంబంధిత కాంట్రాక్టను రద్దుచేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ అంతేకాక ఈ రెండింటిని తర్వాతి స్థానంలో ఉన్న కాంట్రాక్టర్‌కు అప్పగిస్తూ శనివారంలోగా ఉత్తర్వులు సిద్ధం చేయాలని సూచించారు.

స్వర్ణకవచధారణలో దర్శనమిచ్చిన రామయ్య

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామికి విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం చేశారు. అలాగే, స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు జరిపించారు. కాగా, శ్రీలక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

బంజరు భూముల్లో సోలార్ ప్లాంట్లు

- 4వేల మెగావాట్ల మేర ఉత్పత్తికి అవకాశం
- రైతులను సంప్రదించేలా రెడ్‌కో అధికారుల ప్రణాళిక
- ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం



ఖమ్మంవ్యవసాయం: బంజరు భూముల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. వ్యవసాయ యోగ్యం కాని భూముల్లో ప్లాంట్లు ఏర్పాటు చేయించడం ద్వారా రైతులకు ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. రైతులు, వ్యవసాయ ఉత్పత్తి సంఘాలు, సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాలే కాక పంచాయతీలు, గ్రామ సంస్థలు, మండల సమాఖ్యలు, భూమిని లీజ్‌కు తీసుకున్న వారు సైతం ఈ పథకంలో చేరేందుకు వీలుంది.

500 కిలోవాట్ల నుంచి

మూడున్నర ఎకరాలు మొదలు నాలుగు ఎకరాల బంజరు భూమి ఉన్న రైతులు సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఆయా భూముల్లో 500 కిలోవాట్లు మొదలు 4వేల మెగావాట్ల వరకు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశమిస్తారు. దాదాపు అన్ని గ్రామాల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్లు అందుబాటులో ఉన్నందున సోలార్ ప్లాంట్ నుంచి సబ్‌స్టేషన్‌కు విద్యుత్ లైన్ల వ్యయం కూడా భారీగా ఉండదని భావిస్తున్నారు. ప్లాంట్లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీజీఈఆర్‌సీ) నిర్ణయించిన టారిఫ్ ఆధారంగా విద్యుత్ డిస్కంలు కొనుగోలు చేస్తాయి. ఈమేరకు ఆసక్తి ఉన్న వారు www. tgredco. telangana.gov.in వెబ్‌సైట్‌లో లేదా 63049 03933, 90005 50974 నంబర్లలో ఈనెల 22వ తేదీలోగా సంప్రదించాలని టీజీ రెడ్‌కో అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. అంతేకాక బంజరు భూములు ఎక్కువగా గ్రామాలకు అధికారులు నేరుగా వెళ్లి రైతులను సంప్రదించేందుకు సిద్ధమవుతున్నారు.

రైతులు వినియోగించుకోవాలి..



బంజరు భూములను వృథాగా వదిలేయకుండా సోలార్ ప్లాంట్ ఏర్పాటుచేసుకుంటే ఆదాయం లభిస్తుంది. సాగుకు యోగ్యం కాని, నిరుపయోగంగా మారిన భూముల్లో ప్లాంట్ల స్థాపనకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలి.

– ఏ.సురేందర్, ఎస్ఈ, ఎన్పీడీసీఎల్

క్లుప్తంగా

రాష్ట్ర జట్లకు అసిస్టెంట్ కోచ్‌గా శంకర్‌రావు


శంకర్‌రావు

కొణిజర్ల: జాతీయ స్థాయి బీచ్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ పురుషులు, మహిళల జట్లకు అసిస్టెంట్ కోచ్‌గా నూనావత్ శంకర్‌రావు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన కొణిజర్ల మండలం బస్వాపురంలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల పీడీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈమేరకు 2వ తేదీ నుంచి ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్లతో శుక్రవారం బయలుదేరారు. ఈ సందర్భంగా శంకర్‌రావును అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర బాలికల క్రికెట్ జట్టులో స్థానం


యమున


యశస్విని

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి బాలికల క్రికెట్ జట్టుకు జిల్లా నుంచి యమున, పి.యశస్విని ఎంపికయ్యారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ కనబరిచిన వీరికి జట్టులో స్థానం దక్కింది. ఈమేరకు త్వరలో జరిగే పాఠశాలల అండర్–17 జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారని కోచ్ ఎం.డీ.మతిన్ తెలిపారు. ఈసందర్భంగా క్రీడాకారులను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, పీడీ ఆదర్శ్‌కుమార్, శివ తదితరులు శుక్రవారం అభినందించారు.

మహిళా న్యాయవాదుల క్రీడాపోటీలకు ఏర్పాట్లు పూర్తి

ఖమ్మం లీగల్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి మహిళా న్యాయవాదుల క్రీడాపోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తాళ్లూరి సహస్ చౌదరి మెమోరియల్ ట్రస్ట్ తరఫున తాళ్లూరు దిలీప్ ఆధ్వర్యాన ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో నిర్వాహకులు మాట్లాడుతూ పోటీలను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా, జిల్లా జడ్జి జి.రాజగోపాల్ ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి మహిళా న్యాయవాదులు హాజరుకానున్న నేపథ్యాన వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో బిచ్చాల తిరుమలరావు, దిరిశాల కృష్ణారావు, పసుపులేటి శ్రీనివాస్, తాళ్లూరి దిలీప్, రావుల వెంకట్ పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో రిటైర్డ్ అధికారులకు సన్మానం


రిటైర్డ్ ఉద్యోగులతో సీపీ, అధికారులు

ఖమ్మంక్రైం: పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ చేసిన అధికారులకు కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం సన్మానించారు. సీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు ప్రజల రక్షణే ధ్యేయంగా పనిచేసిన ఉద్యోగుల సేవలు మరువలేనివన్నారు. ఈమేరకు డి.వెంకటేశ్వర్లు(ఎస్‌ఐ, సీసీఆర్‌బీ), సీహెచ్.లింగయ్య(ఎస్‌ఐ, సీసీఆర్‌బీ), రవూఫ్(ఎస్‌ఐ, సీటీసీ), కృష్ణారావు(ఎస్‌ఐ, పీసీఆర్), మంగయ్య(ఆర్‌ఎస్‌ఐ), మురళీకృష్ణ(ఏఎస్‌ఐ, సీసీఆర్‌బీ), ఎం.బాబు(ఏఎస్‌ఐ, త్రీటౌన్), ఆర్.నాగేశ్వరరావు(ఎస్‌ఐ, ఏఆర్)ను సన్మానించగా అదనపు డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

పోలీసు క్రీడల్లో ఏఎస్పీకి పతకాలు


పతకాలతో వెంకట్రావు

ఖమ్మం స్పోర్ట్స్: కరీంనగర్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏఎస్పీ జి.వెంకట్రావు పతకాలు సాధించారు. బ్యాడ్మింటన్ 55 ఏళ్ల వయసు కేటగిరీలో ఆయన సింగిల్స్‌లో స్వర్ణ పతకం, డబుల్స్‌లో కాంస్య పతకం దక్కించుకున్నాడు. ఈసందర్భంగా వెంకట్రావును బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యులు అభినందించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,200	6,800
మిర్చి	14,000	6,000
మిర్చి తాలు	7,200	5,700
ఏసీ మిర్చి	12,800	6,000
పత్తి	7,150	5,900

– ఖమ్మం వ్యవసాయం

భూమి పోయినా దక్కని ఫలితం

పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు

- సీతారామ లింక్ కెనాల్ నిర్మాణానికి 170 ఎకరాల భూసేకరణ
- ఆరు నెలలుగా పరిహారంపై దాటవేస్తున్న యంత్రాంగం


లింక్ కెనాల్ పనుల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు (ఫైల్)

ఏన్కూరు: నోటీసులు ఇవ్వకుండానే భూములు తీసుకున్నారు.. పనులు వేగంగా చేపడుతున్నారు.. దీంతో తమ పరిహారం మాటేమిటని రైతులు ఆందోళన చేసిన ప్రతీసారి ప్రజాప్రతినిధులు నచ్చజెప్పి దాటవేయడం ఆనవాయితీగా మారింది. చివరకు వైరాలో జరిగే సభలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షాన పరిహారం చెక్కులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇదంతా జరిగి ఆరు నెలలు గడిచినా పరిహారం అందకపోవడంతో సీతారామ లింక్ కెనాల్ నిర్మాణంలో భాగంగా రెండు మండలాల్లో భూమి కోల్పోయిన 241 మంది గిరిజన రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు.

241 మంది.. 170 ఎకరాలు

సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గోదావరి జలాలను పాలేరు రిజర్వాయర్‌కు చేర్చేలా లింక్ కెనాల్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వినోభానగర్ 18వ టన్నెల్ నుంచి ఏన్కూరు మండలం హిమామ్‌నగర్, రేపల్లెవాడ మీదుగా ఏన్కూరు ఎన్నెస్పీ కెనాల్ వరకు సీతారామ లింక్ కెనాల్ పనులు చేపట్టారు. 80 మీటర్ల వెడల్పుతో తవ్వే ఈ కాల్వ కోసం రెండు మండలాల్లో 241 మంది రైతులకు చెందిన సుమారు 170 ఎకరాల భూమి అవసరమైంది. ఇప్పటికే జూలూరుపాడు మండలం వినోభానగర్ నుంచి హిమామ్‌నగర్ వరకు 30 ఎకరాల్లో లింక్ కెనాల్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ మార్గంలో 36 మంది రైతులు భూములు కోల్పోయారు. రైతులు ఆయిల్‌పామ్, మామిడి తోటలతో పాటు కరివేపాకు వంటి దీర్ఘకాల పంటలను నష్టపోయారు. అంతేకాక పొలాల్లో బోర్లు, బావులు సైతం కనుమరుగయ్యాయి. దాదాపు ఈ పొలాలన్నీ రహదారి పక్కనే ఉండటంతో బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.కోటి పైగానే ధర పలుకుతోంది. ఈ భూములకు ప్రభుత్వం ఇచ్చే అరకొర పరిహారం కూడా నెలల తరబడి పెండింగ్ పెట్టడంతో ఆవేదన చెందుతున్నారు.

మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా..


జూలూరుపాడు మండలంలో జరుగుతున్న లింక్ కెనాల్ పనులు

ఏన్కూరు మండలంలో జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు లింక్ కెనాల్ పనులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు పరిశీలించారు. దీంతో రైతులు కాల్వ పనుల వద్ద ఆందోళన చేపట్టడమే కాక మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత వైరాలో జరిగిన సీఎం హాజరైన సభలో పరిహారం మాటెత్తలేదు. దీంతో ఆరు నెలలుగా నిరీక్షిస్తున్న రైతులు జనవరి 20న వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌ను కలవగా ఎకరాకు రూ.21 లక్షల చొప్పున పరిహారం వస్తుందని చెప్పడంతో సంతోషించారు. ఈ మేరకు ఏన్కూరు, జూలూరుపాడు మండలాల భూనిర్వాసితులు పరిహారం కోసం భూమి పత్రాలు, బ్యాంకు అకౌంట్ల వివరాలను రెవెన్యూ అధికారులకు అందించారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా పరిహారం జమ అవుతుందని భావించినా మరోమారు నిరాశే మిగిలింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు పరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

రెండు ఎకరాల భూమి కోల్పోయా..



లింక్ కెనాల్ నిర్మాణంలో రోడ్డు పక్కనే ఉన్న రెండెకరాల భూమి కోల్పోయా. ఇప్పటి వరకు పరిహారం అందకపోగా రెండు పంటలు కోల్పోయాను. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షాన పరిహారం ఇస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చినా అందలేదు. ఎకరానికి రూ.30 లక్షలు అడుగుతుంటే రూ.20 లక్షలని చెబుతూ అదీ ఇవ్వడం లేదు.

–ఆది నర్సింహారావు, రైతు, ఏన్కూరు

గిరిజన రైతులు నష్టపోతున్నారు..



సీతారామ లింక్ కెనాల్ నిర్మాణంతో గిరిజన రైతులు విలువైన భూములు కోల్పోయారు. ఆందోళనలు చేసి పనులు ఆపినప్పుడల్లా ప్రజాప్రతినిధులు నచ్చజెప్పి ఆగస్టులో పరిహారం ఇస్తామన్నా నేటికీ హామీ నెరవేరలేదు. భూములతో పాటు పంటలు కోల్పోయిన రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించాలి.

–బానోతు బాలాజీ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు

90 శాతం రైతులు పత్రాలు ఇచ్చారు



మండలంలోని హిమామ్‌నగర్ నుంచి ఏన్కూరు వరకు 140 ఎకరాల్లో లింక్ కెనాల్ పనులు జరిగాయి. 205 మంది రైతులకు పరిహారం ఇవ్వాలి. ఇందుకోసం 90 శాతం మంది రైతులు భూమి, బ్యాంకు అకౌంట్ల పత్రాలు ఇచ్చారు. మిగతా వారు వారసత్వ వివాదంతో ఇవ్వలేదు. ప్రభుత్వం నుంచి త్వరలోనే పరిహారం అందుతుంది.

–సీహెచ్ శేషగిరిరావు, తహసీల్దార్, ఏన్కూరు

బాలికల పాఠశాలకు రూ.7 లక్షల విలువైన ఫర్నీచర్


ఫర్నీచర్‌తో హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని బాలికల పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన నోష్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున రూ.7 లక్షల విలువైన ఫర్నీచర్‌ను శుక్రవారం అందజేశారు. ఇందులో 50 డ్యూయెల్ డెస్క్ బెంచీలు, ఐదు వైట్ బోర్డులు, ఆరు ల్యాబ్ టేబుళ్లు, నాలుగు టీచర్ టేబుళ్లతో పాటు ఎనిమిది బీరువాలు ఉన్నాయి. చాలాకాలంగా సరిపడా ఫర్నీచర్ లేక ఇబ్బంది పడుతున్న నేపథ్యాన ఫర్నీచర్ సమకూర్చిన నోష్ ల్యాబ్ సంస్థ బాధ్యులకు హెచ్‌ఎం పి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు


షాపులో తనిఖీ చేస్తున్న లేబర్ ఆఫీసర్ వెంగమాంబ

నేలకొండపల్లి: వ్యాపార సంస్థల బాధ్యులు బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా కార్మిక శాఖ అధికారి చల్లా వెంగమాంబ హెచ్చరించారు. మండల కేంద్రంలోని షాపులు, హోటళ్లలో శుక్రవారం ఆమె తనిఖీలు చేపట్టారు. ఓ షాపులో కార్మికుడికి తక్కువ కూలీ ఇస్తున్నట్లు తేలడంతో యాజమానిపై కేసు నమోదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనాలు చెల్లించాలని, ప్రతీ షాపులో బాల కార్మికులు పనిచేయడం లేదనే బోర్డు ఏర్పాటుచేయాలని సూచించారు.

కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా

- ఒకరి మృతి, 20 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలింపు
- డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం


వరమ్మ (ఫైల్)


బోల్తా పడిన ట్రాక్టర్


ఘటనాస్థలం వద్ద క్షతగాత్రులు

బోనకల్: పొట్టకూటి కోసం కూలీ పనులకు బయలుదేరిన వారిని తీసుకెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా వాహనం బోల్తా పడగా ఓ మహిళ మృతి చెందింది. మరో ఇరవై మందికి తీవ్ర గాయాలైన ఘటన బోనకల్ మండల కేంద్రంలోని వైరా–జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై బోనకల్ బ్రాంచ్ కెనాల్ వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. స్థానికులు, కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. బోనకల్‌కు చెందిన 25 మంది మిరప తోట ఏరేందుకు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయికి ట్రాక్టర్‌లో బయలుదేరారు. గ్రామం దాటగానే బోనకల్ బ్రాంచ్ కెనాల్ సమీపాన ముందుగా వెళ్తున్న మరో ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమాన డ్రైవర్ శేషులు ఎదురుగా మరో లారీ రావడంతో ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న కందకంలో బోల్తా పడింది. ఈ సమయాన నలుగురు కూలీలు ట్రక్కు కింద చిక్కుకుపోగా మిగతా వారు నీటి గుంతలో పడ్డారు.

హాహాకారాలు

ట్రాక్టర్ బోల్తా పడిన సమయాన పెద్దశబ్దం రావడం, ఆపై కూలీలు కేకలు వేస్తుండడంతో సమీపాన ఉన్న స్థానికులు పరుగున చేరుకున్నారు. గుంతలో పడిన వారిని బయటకు తీసేసరికే యార్లగడ్డ వరమ్మ(60) మృతి చెందింది. మరో 20 మందికి కాళ్లు, చేతులు విరగడంతో బోనకల్ పీహెచ్‌సీకి తీసుకొచ్చి ప్రథమ చికిత్స అనంతరం మూడు 108 వాహనాలు, ట్రాలీ ఆటోల్లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఆత్మకూరి లక్ష్మీదేవి, నిమ్మగడ్డ సుబ్బమ్మ పరిస్థితి విషమింగా ఉండడంతో హైదరాబాద్ తీసుకెళ్లారు. కాగా, గాయాలైన వారిలో లింగనబోయిన నాగమణి, మరీదు ధనలక్ష్మి, మరీదు పద్మ, మరీదు సత్యం, గాలి కృష్ణవేణి, లింగం నాగమణి, ఎస్.కే.జమిలి, మోర్ల మహాలక్ష్మి, మరీదు శైలజ, మోర్ల నారాయణమ్మ, లింగం సుశీల, పసల త్రివేణి తదితరులు ఉన్నారు. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమైందని కూలీలు వెల్లడించగా, మృతురాలు, క్షతగాత్రుల బంధువులు పెద్దసంఖ్యలో ఆస్పత్రి చేరుకున్నారు.

ఘటనపై డిప్యూటీ సీఎం ఆరా

ప్రమాదం జరిగిన సమాచారం తెలియగానే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అలాగే, క్షతగాత్రులు పలువురితో మాట్లాడి ధైర్యం చెప్పారు. కాగా, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు పరామర్శించారు. అంతేకాక యార్లగడ్డ వరమ్మ మృతదేహం వద్ద రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ నివాళులర్పించారు.

సీపీఐ నాయకులపై కేసు కొట్టివేత

ఖమ్మంలీగల్: ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించారని 16 మంది సీపీఐ నాయకులపై నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ ఖమ్మం అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏపూరి బిందుప్రియ శుక్రవారం తీర్పు చెప్పారు. 2014లో మమత కాలేజీ సమీపాన సాగర్ కాల్వ కట్టలపై పేదలు గుడిసెలు వేసుకున్నారు. ఈ గుడిసెలను పోలీసులు తొలగించే సమయాన సీపీఐ నాయకులు అడ్డుకుని విధులకు ఆటంకం కలిగించారని అప్పట్లో కేసు నమోదైంది. ఈనేపథ్యాన విచారణ అనంతరం న్యాయమూర్తి ఈ కేసును కొట్టివేశారు. ఈ కేసులో ఉన్న మేకల సంగయ్య, ఎస్.రమాదేవి మృతి చెందగా, బాగం హేమంతరావు, ఎస్.కే.జానీమియా, పోటు కళావతి, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, జక్కుల లక్ష్మయ్య, ఉపేందర్, ఎల్లయ్య, స్వర్ణ ప్రశాంత్, జి.రవి, ఎ.శివ, సామ్రాజ్యం, యాకూబ్‌ను నిర్దోషులుగా తేల్చారు. కాగా, న్యాయవాది ఓరుగంటి శేషగిరిరావు ముద్దాయిల తరఫున వాదించారు.

సత్తుపల్లి రాజీవ్‌నగర్‌లో చోరీ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి రాజీవ్‌నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో దుండగులు చోరీ చేశారు. కాలనీకి చెందిన పోతురాజు సుబ్రహ్మణ్యం అనారోగ్యానికి గురవడంతో చికిత్స కోసం ఇంటికి తాళం వేసి గురువారం ఖమ్మం వెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన దుండగులు శుక్రవారం తెల్లవారుజామున తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఉదయం సుబ్రహ్మణ్యం వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో బీరువాలో పరిశీలించగా వెండి, బంగారు ఆభరణాలు చోరీ అయినట్లు గుర్తించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు.

కల్లూరులో పురుషుల కబడ్డీ జట్టుకు శిక్షణ

కల్లూరు: కల్లూరులోని మినీ స్టేడియంలో జిల్లాస్థాయి పురుషుల కబడ్డీ జట్టుకు శిక్షణ ఇచ్చారు. ఈ జట్టు 3వ తేదీ నుంచి ఆదిలాబాద్‌లో జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుంది. ఈమేరకు శిక్షణలో 12 మందితో కూడిన జట్టు పాల్గొందని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.దయాకర్‌రెడ్డి, క్రిస్టోఫర్ బాబు శుక్రవారం తెలిపారు. ఈకార్యక్రమంలో శిబిరం కోఆర్డినేటర్ పసుపులేటి వీరరాఘవయ్య, పీఈటీ, పీడీలు బీమా, కె.రాధాకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మోటమర్రిలో మిర్చితోట ధ్వంసం

బోనకల్: మండలంలోని మోటమర్రికి చెందిన రైతు వీరభద్రం ఎకరం భూమిలో సాగు చేసిన మిర్చితోటను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం ధ్వంసం చేశారు. మిరప మొక్కలను కొడవళ్లతో కోసేయగా రూ.2లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా సీపీఐ నాయకులు యంగల ఆనందరావు, తూము రోషన్‌కుమార్, ఆకెన పవన్ తోటను పరిశీలించారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెం సమీపాన జామాయిల్‌తోటలో పేకాట ఆడుతున్న ఐదుగురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. పలువురు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో తనిఖీ చేయగా ఐదుగురు పట్టుబడ్డారని, వీరి నుంచి రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి

సత్తుపల్లి: సత్తుపల్లి అర్బన్ పార్క్‌కు ఫెన్సింగ్ సరిగ్గా లేకపోవడంతో అందులో నుంచి దుప్పులు రాత్రి వేళ సమీపంలోని ఇళ్లు, తోటల్లోకి వస్తున్నాయి. ఈక్రమంలోనే కొద్దిరోజుల క్రితం ఓ దుప్పి బయటకు వచ్చినట్లు తెలుస్తుండగా కుక్కలు దాడి మృతి చెందినట్లు తెలిసింది. ఈనేపథ్యాన ఆంజనేయస్వామి గుడి సమీపాన మామిడి తోటలో దుప్పి కళేబరాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు. కాగా, పార్క్‌కు గుడివైపు ఫెన్సింగ్ సరిగా లేదని ఇటీవల సత్తుపల్లికి వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు అటవీశాఖ ఉన్నతాధికారులు పరిశీలించి ఫెన్సింగ్ వేస్తామని చెప్పి రెండు నెలలు కావొస్తున్నా పనులు చేపట్టకపోవడంతో దుప్పి మృత్యువాత పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మాదిగల ద్రోహి కాంగ్రెస్

- ఎస్సీ రిజర్వేషన్ అమలులో మీనమేషాలు
- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ రిజర్వేషన్ల ద్వారా మాదిగ సామాజికవర్గాలకు న్యాయం చేయాలన్న సుప్రీంకోర్టు తీర్పు అమలులో కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మాదిగలకు అన్యాయం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నేతలే సభలు ఏర్పాటుచేస్తున్నా పార్టీ పరంగా స్పందించడం లేదన్నారు. మరోపక్క సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన సీఎం ఆ దిశగా ఎలాంటి కార్యాచరణ చేపట్టడం లేదని విమర్శించారు. తద్వారా కాంగ్రెస్ వైఖరి వర్గీకరణకు వ్యతిరేకమని భావించాల్సి వస్తోందని తెలిపారు. ఇకనైనా ఎస్సీ వర్గీకరణను అమలుచేసి ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో వర్తింపచేయాలని సండ్ర డిమాండ్ చేశారు. కాగా, కేసీఆర్ హయాంలో దళిత బంధు, 1,025 గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటయ్యాయని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం దళిత బంధు, ఎస్సీ కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ఎకరం లోపు భూమి కలిగిన దళితులకు సైతం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఖమర్, బీఆర్‌ఎస్ నగర, రూరల్ అధ్యక్షులు పగడాల నాగరాజు, బెల్లం వేణుగోపాల్‌తో పాటు శీలంశెట్టి వీరభద్రం, బిచ్చాల తిరుమలరావు, బొమ్మెర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కారుకు ప్రమాదం

వైరా: ఖమ్మం నుంచి సత్తుపల్లి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కారు వైరా మున్సిపాలిటీ పరిధి శాంతినగర్ వద్ద ప్రమాదానికి గురైంది. ఆయన కారును వెనక నుంచి వస్తున్న మరో కారు ఢీకొట్టగా వెంకటవీరయ్య కారు డ్రైవర్ అప్రమత్తమై పక్కకు తీయడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో కారు వెనక భాగం దెబ్బతినగా ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

నిరసన బాటలో ఉపాధి హామీ ఉద్యోగులు

మూడు నెలల వేతనాలు అందకపోవడంతో ఆందోళన


నిరసనలో పాల్గొన్న ఉపాధి హామీ ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నా తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులు నిరసనకు దిగారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధి హామీ పథకం ఉద్యోగులు, సిబ్బంది పెన్‌డౌన్, షట్‌డౌన్ ద్వారా నిరసన తెలిపారు. రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు చేపట్టిన నిరసన వేతనాలు చెల్లించే వరకు కొనసాగుతుందని వెల్లడించారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వెంకటరాజు, హెచ్‌ఆర్ మేనేజర్ విజేత, ఉద్యోగులు సురేష్, స్రవంతి, శిల్ప, జ్యోతి, కొండలు, వరలక్ష్మి, ముజీబ్, సతీష్, సునీత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షల్లో కాపీయింగ్

సత్తుపల్లి: బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈమేరకు సత్తుపల్లి జేవీఆర్ డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో శుక్రవారం ఒకరి పరీక్ష ఇంకొకరు రాస్తూ పట్టుబడ్డారు. పరీక్షకు కనపర్తి సాయికుమార్ హాల్‌టికెట్‌పై గుడిపూడు శ్రీనివాసరావు ఫొటో అంటించుకుని హాజరయ్యాడు. ఈ విషయాన్ని ఇన్విజిలేటర్ గుర్తించగా కేసు నమోదు చేశారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా


వల్లభి మీదుగా ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్లు

ముదిగొండ: ముదిగొండ మండలంలోని గంధసిరి, పెద్దమండవ సమీపాన మున్నేరు నుంచి ఇసుక అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. ముదిగొండ సీఐ మురళి నేతృత్వాన పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతుండడంతో పాటు మున్నేటిలోకి ట్రాక్టర్లు వెళ్లకుండా గండి తీయించారు. దీంతో ఆరు నెలల పాటు ఇసుక ట్రాక్టర్లు కానరాలేదు. మళ్లీ ప్రస్తుతం రాత్రింబవళ్లు రవాణా మొదలుపెట్టారు. పోలీసు, రెవెన్యూ ఉద్యోగులు తనిఖీలు చేపడుతున్నా వారి కన్నుగప్పి ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్తుండడం గమనార్హం. ఈ విషయమై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కుటుంబం చెంతకు మహిళ


దేవ్లీ, ఆమె బంధువు, పోలీసులతో అన్నం శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: రెండు నెలలు క్రితం మతిస్థిమితం లేని ఒక వివాహిత ఖమ్మం చేరుకోగా ఆమెను పోలీసులు అన్నం ఫౌండేషన్‌లో చేర్పించారు. దీంతో ఆమెకు చికిత్స చేయించగా ఆరోగ్యం కొంత కుదుటపడడంతో సూర్యాపేట జిల్లా పాత గోల్‌తండాకు చెందిన ధరావత్ దేవ్లీగా తన పేరు, కుటుంబం వివరాలు చెప్పింది. ఈమేరకు శుక్రవారం ఆమెను అనంతగిరి తీసుకెళ్లి పోలీసుల సమక్షాన కుటుంబసభ్యులకు అప్పగించినట్లు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు.

గడ్డివామికి నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు


కాలిపోతున్న గడ్డివామి

బోనకల్: మండలంలోని చిరునోములలో ఏడెకరాలకు సంబంధించి వేసిన వరి గడ్డివామి కాలిపోయింది. గ్రామ రైతులు చాపలమడుగు శ్రీనివాసరావు, రమేష్‌బాబుకు చెందిన గడ్డివామికి శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో కాలి బూడిదైంది. ఈ ఘటనలో రూ.లక్ష మేర నష్టం జరిగింది. గత ఏడాది ఫిబ్రవరిలోనూ రైతుల గడ్డివామికి దుండగులు నిప్పంటించారు. కక్ష సాధింపులో భాగంగానే ఇలా చేస్తున్నారని బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.